https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 361 ఆదివారం 12-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.


సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే

# శాంతి భద్రతలు

## ప్రధాని నరేంద్ర మోదీ



**పశ్చిమ బెంగాల్, ఏప్రిల్ 11**

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్వ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం.

ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## ఆ పనుల్లో నేనెక్కడా అవినీతి చేయలేదు: సీతక్క



**ములుగు, ఏప్రిల్ 11**

మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పున: నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గద్దెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. ఈరోజు(శనివారం) ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు.

## తెలంగాణ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో కలకలం

### డిప్యూటీ కమిషనర్ రాజీనామా..




**నిజామాబాద్,ఏప్రిల్ 11**

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్, నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సోమిరెడ్డి మాట్లాడుతూ.. 'గురువారం అర్ధరాత్రి నాంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ల బదిలీల సమావేశం జరిగింది. సూపరింటెండెంట్ల ట్రాన్స్‌ఫర్ల విషయంలో ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి అన్యాయంగా మాట్లాడారు. ఎక్సైజ్ కమిషనర్ తీరు సరిగా లేదు. నన్ను ఒక వెధవ అని సంబోధించారు. నన్నే కాదు చాలా మంది సిబ్బందిని ఇలానే నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేవారు. రెండు సంవత్సరాల నుంచి కమిషనర్ తీరు ఇలాగే ఉంది. ఒక తెలంగాణ వ్యక్తిగా ఏ తప్పు చేయకున్నా అధికారి తిడితే మాటలు పడలేం. అందుకే ఇక ఈ ఉద్యోగం చేయకూడదని డిసైడ్ అయ్యాను. 30 ఏళ్ల సర్వీస్ వదులుకుంటున్నందుకు బాధగా ఉన్నా తప్పడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

## 200కు పైగా సీట్లు గెలుచుకుంటాం

### డీఎంకే పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్




**చెన్నై, ఏప్రిల్ 11**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ (వీఖ క్ఘ్శ్రీఅఅ) తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారత పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## హిందువులంతా మరింత ఐక్యం కావాలి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**నిజామాబాద్,ఏప్రిల్ 11**

హిందువులను సంఘటితం చేసేందుకే స్వయం సేవక్ సంఘ్‌ను కేశవ్ బలీరాం హెడ్గేవార్ స్థాపించారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందువులంతా మరింత ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కందకుర్తి దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రెంజల్ మండలం కందకుర్తిలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పర్యటించారు. ఈ సందర్భంగా కేశవ్ స్ఫూర్తి మందిరం ప్రారంభోత్సవంలో భగవత్ పాల్గొన్నారు. మందిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్ఫూర్తి కేంద్రాన్ని ప్రతి ఒక్క హిందువు సందర్శించాలని భగవత్ విజ్ఞప్తి చేశారు. చరిత్రను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయాల్సిన అవ సరం ఉందని నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలకులను భారత్ నుంచి తరిమికొట్టాలని హెగ్దేవార్ తపన పడ్డారని, ఆ కల నెరవేరిందని మోహన్ భగవత్ తెలిపారు.

## మూడు పార్టీలు కలిసి పని చేస్తే

# తిరుగుండదు

### సీఎం చంద్రబాబు

**అమరావతి ఏప్రిల్ 11**



ప్రజా ప్రతినిధులు, అధికారులు పని తీరు ఏ విధంగా ఉందనే అంశంపై ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. వచ్చిన సర్వే నివేదికలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆదేశించారు. పక్కా సర్వేలు చేసి టికెట్లు ఏ విధంగా ఇచ్చామో.. ఇప్పుడూ అదే విధంగా సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలు అద్భుతంగా ఉన్నాయని.. ప్రజలతో మమేకమైతే భవిష్యత్తులో చక్కటి విజయం దక్కించుకోవచ్చని చెప్పారు. కులాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నామని.. దానికి అనుగుణంగానే అన్ని కులాల్లో ఆదరణ పెరగాలని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ప్రభుత్వ సేవల్లో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నెల్లూరు మోడల్ అవలంభించాలని సూచించారు. సోషల్ మీడియాలోనూ ప్రచారం పెద్దఎత్తున చేపట్టాలన్నారు. చెడు ప్రచారం వేగంగా వెళ్తుందని.. మంచి ప్రచారం నెమ్మదిగా వెళ్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు వ్యవహరించాలని హితవుపలికారు. కూటమి పార్టీలు సమన్వయంతో పని చేయాలని.. మూడు పార్టీల కేడర్ కలిసి పని చేస్తే తిరుగుండదని ప్రజాప్రతినిధులకు చెప్పారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ హాజరయ్యారు. అలాగే కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రామచంద్రపురం ఎమ్మెల్యే, మంత్రి వాసంశెట్టి సుభాశ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పాల్గొన్నారు.

## బీసీ మహిళల ఉప కోటా కోసం

# కవిత పోరాట శంఖారావం

**పూలే ఆశయాల స్ఫూర్తితో ఢిల్లీ వేదికగా ఆందోళనలు**

**అసెంబ్లీ వద్ద పూలే విగ్రహ ఏర్పాటుపై ప్రభుత్వ జాప్యంపై ధ్వజం**

**విద్యుత్ శాఖ ఆర్టిజన్ల పోరాటానికి తెలంగాణ జాగృతి మద్దతు**



**హైదరాబాద్, ఏప్రిల్ 11**

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో వెనుకబడిన తరగతుల మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించకపోవడంపై ఆమె కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా నిరాకరించడం అంటే ఆ వర్గాల పట్ల పాలకులకు ఉన్న చులకన భావానికి నిదర్శనమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చల సందర్భంగా తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లనున్నట్లు కవిత వెల్లడించారు. అక్కడ వివిధ రాజకీయ పార్టీల జాతీయ నాయకులను కలిసి బీసీ మహిళల ఉప కోటా ఆవశ్యకతను వివరించనున్నట్లు తెలిపారు. కేవలం సంఖ్యాబలం ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని ఆమె తేల్చిచెప్పారు. చట్టసభల్లో అట్టడుగు వర్గాల మహిళలకు ప్రాతినిధ్యం లభించినప్పుడే ప్రజాస్వామ్యానికి పూర్తి స్థాయి అర్థం చేకూరుతుందని, ఈ దిశగా జాతీయ స్థాయిలో మద్దతు కూడగడతామని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కవిత తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తాము డిమాండ్ చేస్తే, ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ జాప్యం వల్ల మహనీయుల గౌరవానికి భంగం కలుగుతోందని, కనీసం రాబోయే అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ విగ్రహ ఏర్పాటు పనులను పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సామాజిక విప్లవకారుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, వారి స్మృతి చిహ్నాల విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని హితవు పలికారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా తన గళాన్ని వినిపించారు. ఆర్టిజన్ల క్రమబద్ధీకరణ కోరుతూ సాగుతున్న ఉద్యమానికి తెలంగాణ జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని ఆమె ప్రకటించారు. కొత్తగూడెంలో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల్లో జాగృతి నాయకులు ప్రత్యక్షంగా పాల్గొంటారని వెల్లడించారు.



# కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు

**మోతె రోడ్డులో సభా స్థలాన్ని పరిశీలించిన ముఖ్య నేతలు**

**లక్ష మందితో సభను జయప్రదం చేసేందుకు సన్నాహాలు**

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్న కొప్పుల**



**జగిత్యాల, ఏప్రిల్ 11**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ కోసం పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ సభకు సంబంధించి మోతె రోడ్డు పక్కన ఉన్న విశాలమైన స్థలాన్ని మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు వచ్చే జనసమీకరణ, వాహనాల రాకపోకలు, మరియు భద్రతా అంశాలపై నేతలు చర్చించి తగిన సూచనలు చేశారు. జగిత్యాల గడ్డపై బీఆర్ఎస్ సత్తా చాటేలా ఈ భారీ బహిరంగ సభను నిర్వహించాలని గులాబీ దళం పట్టుదలతో ఉంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేళ్లలోనే పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలలో ఒక్కటినీ కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో నెరవేర్చలేదని ఆరోపించారు. జగిత్యాల సభ ద్వారా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని, ఈ భారీ బహిరంగ సభ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వల్ల ఉత్తర తెలంగాణలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లయిందని నేతలు అభిప్రాయపడ్డారు. జీవన్ రెడ్డి రాకతో పార్టీ కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, జిల్లాలో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల సభ విజయవంతం కావడం ద్వారా జిల్లా రాజకీయాల్లో కీలక మార్పులు వస్తాయని భావిస్తున్నారు. ఈ సభకు పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేయనుండటంతో, స్థానిక నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది. ఈ బహిరంగ సభకు సుమారు లక్ష మందికి పైగా జనాన్ని సమీకరించాలని పార్టీ నిర్ణయించింది. దీనికోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, సామాన్య ప్రజలు తరలివచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. కేసీఆర్ రాకతో జగిత్యాల ప్రాంతంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. భారీ స్థాయిలో వాహనాల పార్కింగ్ మరియు వేదిక నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. సభ విజయవంతం కోసం గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి జనసమీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. సభా స్థల పరిశీలన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ దావా వసంత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, లోక బాపురెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కేసీఆర్ బహిరంగ సభతో జగిత్యాల జిల్లా రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారనుంది. బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని మరియు బలాన్ని నిరూపించుకోవడానికి ఈ సభను ఒక వేదికగా మలచుకోనుంది.

# రేవంత్ రెడ్డి అహంకారానికి ప్రజలే బుద్ధి చెబుతారు

**కేటీఆర్ - ఫోర్త్ సిటీ పేరుతో భూముల దందా.. కుటుంబ సభ్యులకే లబ్ధి**

**ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై ఎగిరిన గులాబీ జెండా - అధికారులు అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తి లేదు**







**హైదరాబాద్, ఏప్రిల్ 11**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రేవంత్ రెడ్డి తన అహంకారంతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదవాళ్ల భూములను అరాచకంగా గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి, తెలంగాణ చరిత్రలో ఒక 'చరిత్ర హీనుడిగా' మిగిలిపోతారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మరియు క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సాధించిన విజయంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో అక్రమాలకు పాల్పడి, చైర్మన్ పదవులను అన్యాయంగా దక్కించుకోవాలని చూసినా, చివరికి న్యాయమే గెలిచిందని ఆయన పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో గులాబీ జెండా ఎగిరిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎదిరించి నిలబడిన యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మొండితనం ఉన్న నాయకత్వం ఉంటే ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని ఈ విజయం నిరూపించిందన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఫోర్త్ సిటీ' అనేది ఒక పెద్ద డ్రామా అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అదే భూముల్లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ కడతామని నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కేవలం తన కుటుంబ సభ్యులకు, అనుచరులకు భూములు కట్టబెట్టడం కోసమే రేవంత్ రెడ్డి ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. ఉన్న సిటీలో దోమల వల్ల జనం చనిపోతుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ కడతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోహెడలోని పండ్ల మార్కెట్ భూములను కూడా అమ్ముకునేందుకుప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో నిషేధిత భూముల జాబితాతో ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. గతంలో 16 లక్షలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను కోటి ఎకరాలకు పెంచి, భూముల దందా మరియు సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లపై ఒత్తిడి తెస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం స్థానిక ఎమ్మెల్యే హోటళ్లు, బార్లు, క్రషర్ల నుండి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ఈ అరాచకాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. అక్రమాలకు సహకరిస్తున్న అధికారులకు కేటీఆర్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే, భవిష్యత్తులో వచ్చే తమ ప్రభుత్వంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, అందరినీ గుర్తుంచుకొని శిక్షిస్తామని తెలిపారు. అధికారులు కేవలం ప్రజల కోసమే పనిచేయాలని సూచించారు. రెండేళ్ల కష్టకాలం ముగిసిందని, త్వరలోనే రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు న్యూయార్క్ టెక్ దిగ్గజం 'పికో' రాక

**తెలంగాణ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డితో భేటీ**

**'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా పెట్టుబడుల ఆహ్వానం**

**గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా భాగ్యనగరం**



**హైదరాబాద్, ఏప్రిల్ 11**

న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ 'పికో' ప్రతినిధులు శనివారం తెలంగాణ సచివాలయాన్ని సందర్శించారు. రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రతినిధి బృందానికి ఘనస్వాగతం పలికారు. సచివాలయంలో జరిగిన ఈ కీలక భేటీలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ కార్యకలాపాలకు కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ప్రణాళికను పికో బృందానికి మంత్రి వివరించారు. రాబోయే రెండు దశాబ్దాలలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా, ఆవిష్కరణల అడ్డాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలతో పోటీ పడుతూ, గ్లోబల్ లీడర్లకు మరియు ఫ్యూచర్ టెక్ పరిశ్రమలకు తెలంగాణను మొదటి ఎంపికగా నిలబెడుతున్నామని చెప్పారు. ఈ విజన్‌లో భాగంగా విదేశీ కంపెనీలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తు సాంకేతికత అంతా హైదరాబాద్ వేదికగానే రూపుదిద్దుకుంటోందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేవలం ఐటీ రంగమే కాకుండా, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కూడా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలను రూపొందిస్తోంది. పికో టెక్నాలజీ వంటి అంతర్జాతీయ సంస్థల రాకతో స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్లోబల్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ తన ముద్రను ప్రపంచ పటంలో మరింత పటిష్టం చేసుకుంటోందని వివరించారు. పికో టెక్నాలజీ ప్రతినిధులు సచివాలయంలోని అత్యాధునిక సౌకర్యాలను చూసి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ పారదర్శక విధానాలు మరియు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసే ప్రక్రియ తమను ఆకట్టుకున్నాయని వారు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తమ వ్యాపార విస్తరణకు ఉన్న అనుకూలమైన వాతావరణాన్ని పరిశీలించి, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ పర్యటన ద్వారా న్యూయార్క్ మరియు హైదరాబాద్ మధ్య సాంకేతిక బంధం మరింత బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని ఈ భేటీ మరోసారి నిరూపించింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు పికో టెక్నాలజీకి చెందిన కీలక ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రతినిధి బృందం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు మరియు సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ' నినాదంతో ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోందని మంత్రి కోమటిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ సంస్థలు తెలంగాణ బాట పట్టేలా ప్రభుత్వం తన దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేయనుంది. రాబోయే 2047 విజన్ దిశగా ఇదొక ముందడుగు అని చెప్పవచ్చు.



# అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ. 15 వేల కోట్ల భూమి స్వాధీనం**

**ముఖీమ్ గెస్ట్ హౌస్‌తో పాటు 6 అంతస్తుల భవనం కూల్చివేత**

**పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండానే ఆక్రమణల తొలగింపు**

**భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రభుత్వ భూమికి రక్షణ**

**సంగారెడ్డి, ఏప్రిల్ 11**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో హైడ్రా శనివారం భారీ ఆపరేషన్ చేపట్టింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1,263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో ఇప్పటికే అనేక నివాసాలు ఏర్పడ్డాయి. అయితే, సామాన్య ప్రజలు మరియు పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా, కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలనే లక్ష్యంగా చేసుకుని హైడ్రా ఈ కూల్చివేతలు చేపట్టింది. సుమారు 860 ఎకరాల మిగిలిన ప్రభుత్వ భూమిని కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఖీమ్ అనే వ్యక్తి నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. 1998 నుండి కోర్టు స్టే ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఈ నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా ముఖీమ్ సోదరుడు అజీమ్ నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని కూడా కూల్చివేశారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని ఈ చర్య ద్వారా హైడ్రా స్పష్టమైన సంకేతాలు పంపింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఆక్రమణదారుల



మాయోపా యాలను కూడా హైడ్రా అధికారులు ఈ సందర్భంగా పసిగట్టారు. అజీమ్ నిర్మించిన ఆరు అంతస్తుల భవనంలో ఎవరూ నివాసం ఉండనప్పటికీ, కూల్చివేతలను అడ్డుకోవడానికి కొంతమందిని అప్పటికప్పుడు అద్దెకు దించి, అక్కడ జనం ఉంటున్నట్లుగా చిత్రించే ప్రయత్నం చేశారని అధికారులు తెలిపారు. అయితే వాస్తవ పరిస్థితిని గమనించిన హైడ్రా, ఆ భవనంలో ఉన్న వారిని ఖాళీ చేయించి ఆక్రమణలను తొలగించింది. ప్రభుత్వ భూమిని కాపాడుకోవడంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఖాళీగా ఉన్న అక్రమ కట్టడాలను ప్రాధాన్యత క్రమంలో తొలగిస్తున్నామని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం హైడ్రా స్వాధీనం చేసుకున్న 860 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ సుమారు 15 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని ప్రాథమిక అంచనా. ఇంత భారీ విలువైన జాతీయ సంపదను ప్రైవేటు వ్యక్తుల పరం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. ఐలాపూర్ తండాతో పాటు గ్రామంలోని పాత నివాసాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కేవలం ఖాళీ స్థలాలను మరియు కొత్తగా వెలిసిన అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంటోంది. భూ మాఫియా నుండి ప్రభుత్వ భూములను విముక్తి చేసేందుకు ఈ ఆపరేషన్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మున్ముందు కూడా అమీన్‌పూర్, పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నిరంతర నిఘా ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపు అనంతరం స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. హైడ్రా చేపట్టిన ఈ సాహసోపేతమైన చర్యపై సామాన్య ప్రజల నుండి మద్దతు లభిస్తోంది. కేవలం పెద్దల కట్టడాలనే లక్ష్యంగా చేసుకుని, పేదలకు భరోసా కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# మీర్జాపూర్‌లో న్యాయవాది కాల్చివేత

**దేశవ్యాప్తంగా మిన్నంటిన నిరసనలు - మార్నింగ్ వాక్‌లో ఉన్న రాజీవ్ సింగ్‌పై బుల్లెట్ల వర్షం**

**దేశవ్యాప్త రక్షణ చట్టం కోసం న్యాయవాద సంఘాల డిమాండ్ - భద్రత లేనిదే కోర్టు విధులకు హాజరుకాబోమని హెచ్చరిక**



**మీర్జాపూర్, ఏప్రిల్ 11**

ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలో ఈ ఉదయం జరిగిన ఘోర హత్యోదంతం యావత్ న్యాయవాద లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. సీనియర్ న్యాయవాది రాజీవ్ సింగ్ తన నిత్య కృత్యంలో భాగంగా మార్నింగ్ వాక్‌కు వెళ్లగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు కిరాతకులు పక్కా ప్లాన్‌తో ఆయనను వెంటాడి వేటాడారు. తప్పించుకునే ప్రయత్నం చేసినా వదలకుండా పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరపడంతో రాజీవ్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. పాత కక్షల నేపథ్యమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నప్పటికీ, పట్టపగలు నిత్యం జనసంచారం ఉండే ప్రదేశంలో ఈ దారుణం జరగడం శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఒక్క ఘటనే కాకుండా, గత కొన్ని నెలలుగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో న్యాయవాదులే లక్ష్యంగా దాడులు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు కోర్టు గదులకే పరిమితమైన గొడవలు, ఇప్పుడు నడిరోడ్లపై ప్రాణాలు తీసే స్థాయికి చేరుకున్నాయి. బీహార్, రాజస్థాన్, మరియు తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాంటి హింసాత్మక ఘటనలు నమోదు కావడం న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి భద్రత లేదనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. సమాజంలో బాధితుల పక్షాన నిలబడి పోరాడే వ్యక్తులకే రక్షణ కరువైతే, ఇక సామాన్యులకు న్యాయం ఎలా అందుతుందని న్యాయ నిపుణులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ వరుస హత్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్లు ఏకతాటిపైకి వచ్చి భారీ నిరసనలకు పిలుపునిచ్చాయి. ఈ రోజు మీర్జాపూర్‌లో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి రహదారిపై బైఠాయించగా, ఢిల్లీ మరియు ఇతర మెట్రో నగరాల్లోని న్యాయవాద సంఘాలు వీరికి మద్దతు ప్రకటించాయి. న్యాయవాదులపై దాడులు జరిగినప్పుడు కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు మరియు ప్రభుత్వం విఫలమవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. నిందితులను పట్టుకోవడంలో జరిగే జాప్యం నేరస్థులకు మరింత ఊతాన్ని ఇస్తోందని, తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వీరికి శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్త న్యాయవాదుల ప్రధాన డిమాండ్ అయిన 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' (న్యాయవాదుల రక్షణ చట్టం) పై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. వైద్యులకు ఉన్నట్లుగానే తమకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం ఉండాలని, విధి నిర్వహణలో ప్రాణహాని కలిగించే వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని వారు కోరుతున్నారు. రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఈ దిశగా అడుగులు వేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒకే రకమైన పటిష్ట చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే న్యాయవాదులు ఎవరికీ భయపడకుండా స్వతంత్రంగా తమ విధులను నిర్వర్తించగలరని వారు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, న్యాయవ్యవస్థలో ఒక రకమైన అభద్రతా భావం అలుముకుంది. మీర్జాపూర్ ఘటనపై స్పందించిన భారత బార్ కౌన్సిల్, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. న్యాయవాదుల భద్రతకు భరోసా కల్పించని పక్షంలో దేశవ్యాప్తంగా నిరసనలను ఉధృతం చేస్తామని పేర్కొంది. ఒకవైపు పోలీసులు ప్రత్యేక బృందాలతో హంతకుల కోసం గాలిస్తున్నా, చట్టసభల్లో చర్చ జరిగి శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం ఆగదని న్యాయవాద లోకం స్పష్టం చేస్తోంది. ఈ ఉదంతం దేశ రాజధాని మొదలుకొని పల్లెల వరకు న్యాయవాదులందరినీ ఒక్కటి చేసింది.

# అమెరికా ఇరాన్ మధ్య కీలక శాంతి చర్చలు

**ఇస్లామాబాద్ వేదికగా దౌత్యపరమైన సంప్రదింపులు**

**ప్లాన్ బీ అవసరం లేదన్న డొనాల్డ్ ట్రంప్ - చర్చల వేళ ఇరు దేశాల మధ్య పరస్పర హెచ్చరికలు**

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి ముగింపు పలికే దిశగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు శనివారం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఆరంభమయ్యాయి. ఈ కీలక చర్చల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళిక (ప్లాన్ బీ) తమ వద్ద ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ సైనిక శక్తిని తమ దళాలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతీశాయని, అందుకే మరో ప్రణాళిక అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. ఈ శాంతి చర్చల్లో పాల్గొనేందుకు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పాకిస్థాన్ చేరుకుంది. వారికి ఇస్లామాబాద్‌లో పాక్ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఘన స్వాగతం పలికారు. అమెరికా పక్షాన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే చర్చలు ప్రారంభానికి ముందే వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. తమతో ఆటలు ఆడాలని చూస్తే చర్చల బృందం సహించబోదని, కఠినంగా వ్యవహరిస్తామని ఆయన పారిస్ నుంచే సంకేతాలు పంపారు. గత కొన్ని వారాలుగా క్షిపణి దాడులతో అట్టుడికిన గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ అమలవుతోంది. ఈ ప్రశాంత సమయాన్ని వినియోగించుకుని ఇరు దేశాలు చర్చలకు సిద్ధమైనప్పటికీ, పశ్చిమాసియాలో అమెరికా తన బలగాలను మరింతగా మోహరించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. ఒకవైపు శాంతి మంత్రం పఠిస్తూనే, మరోవైపు సైనిక బలాన్ని ప్రదర్శించడం ఇరాన్‌ను ఒత్తిడికి గురిచేసే వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



ఈ చర్చల ఫలితాలపైనే పశ్చిమాసియా భవిష్యత్తు మరియు శాంతి ఆధారపడి ఉన్నాయి. చర్చల బేరసారాల్లో భాగంగా ఇరు దేశాలు తమ డిమాండ్లను ముందే సిద్ధం చేసుకున్నాయి. అమెరికా 15 అంశాలతో కూడిన ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచింది. ఇందులో ప్రధానంగా ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని, సైనిక పరిమితులకు లోబడి ఉండాలని షరతులు విధించినట్లు తెలుస్తోంది. దీనికి ప్రతిగా ఇరాన్ 10 అంశాల ప్రణాళికను సమర్పించింది. యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని అమెరికా గుర్తించాలని ఇరాన్ గట్టిగా కోరుతోంది. ప్రస్తుత పరిస్థితిపై ట్రంప్ స్పందిస్తూ, ఇరాన్ సైన్యం ఓడిపోయిందని, వారి వద్ద ప్రస్తుతం కొన్ని క్షిపణులు మరియు పరిమితమైన తయారీ సామర్థ్యాలు మాత్రమే మిగిలి ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమెరికా సైన్యం అద్భుతమైన పనితీరు కనబరిచి శత్రువును గట్టిగా దెబ్బతీసిందని ఆయన విలేకరులతో అన్నారు. ఇదిలా ఉండగా, వచ్చే వారం లెబనాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య కూడా చర్చలు జరగాల్సి ఉంది. ఈ వరుస దౌత్యపరమైన ప్రయత్నాలు పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు దారితీస్తాయని ప్రపంచ దేశాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

# పార్లమెంట్ ఆవరణలో అరుదైన దృశ్యం

**రాహుల్‌తో ప్రధాని మోదీ భేటీ - ఒక నిమిషం పాటు ముచ్చటించుకున్న ఇద్దరు అగ్రనేతలు**

**జ్యోతిబా పూలే జయంతి వేడుకల వేళ ఆసక్తికర కలయిక - సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన రాజకీయ ప్రత్యర్థుల వీడియో**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11**

దేశ రాజధాని న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణ శనివారం ఒక అరుదైన మరియు ఆసక్తికరమైన సన్నివేశానికి వేదికైంది. రాజకీయంగా నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒకరినొకరు ఎదురుపడటమే కాకుండా, కాసేపు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. కారు నుంచి దిగి వెళ్తున్న ప్రధాని మోదీ, మార్గమధ్యలో ఉన్న రాహుల్ గాంధీని చూడగానే అక్కడే ఆగి ఆయన వద్దకు వెళ్లారు. ఇద్దరు నేతలు చాలా దగ్గరగా నిలబడి సుమారు ఒక నిమిషం పాటు సంభాషించుకోవడం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ అరుదైన భేటీకి సంబంధించిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికలపై విపరీతంగా వైరల్ అవుతోంది. మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ ఆవరణలోని 'ప్రేరణ స్థల్' వద్ద నివాళులర్పించేందుకు ప్రధాని మోదీ వెళ్లారు. అదే సమయంలో అక్కడే ఉన్న రాహుల్ గాంధీని పలకరించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సభలో ఒకరిపై ఒకరు పదునైన విమర్శలు సంధించుకునే ఈ ఇద్దరు నేతలు, బయట ఇలా ప్రశాంతంగా మాట్లాడుకోవడం ప్రజాస్వామ్యంలోని ఆరోగ్యకరమైన సంప్రదాయానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ మరియు కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఇతర నేతలు కూడా ఈ ఆసక్తికర కలయికను ఎంతో ఆసక్తిగా గమనించారు. దేశంలోని ఇద్దరు ప్రధాన రాజకీయ ధ్రువాలు ఇలా ఏకాంతంగా మాట్లాడుకోవడం అరుదైన విషయంగా చెప్పవచ్చు. ఈ భేటీ సమయంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మరియు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ కూడా ప్రధాని వెంట ఉన్నారు. వీరందరి సమక్షంలోనే మోదీ, రాహుల్ కాసేపు సంభాషించారు. ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించుకోవడం, పరస్పర యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. పార్లమెంట్ లోపల సభా మర్యాదలు, గొడవలు ఎలా ఉన్నా, బయట నేతల మధ్య ఉండే వ్యక్తిగత గౌరవం ఈ ఘటన ద్వారా మరోసారి వెల్లడైంది. అయితే వీరిద్దరూ వ్యక్తిగతంగా ఏం మాట్లాడుకున్నారనే దానిపై మాత్రం ఇప్పటికీ స్పష్టత రాలేదు. జ్యోతిబా పూలే జయంతి వేడుకల సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఈ సన్నివేశం చోటుచేసుకుంది. పూలే ఆశయాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించిన అనంతరం ప్రధాని తన కారు వైపు వెళ్తుండగా ఈ కలయిక జరిగింది. అటు రాహుల్ గాంధీ కూడా ప్రధాని పలకరింపునకు సానుకూలంగా స్పందించడం గమనార్హం. గతంలో కూడా కొన్ని అరుదైన సందర్భాల్లో వీరు ఇలా పలకరించుకున్నప్పటికీ, ఒక నిమిషం పాటు ఆగి మరీ ముచ్చటించుకోవడం ఇదే మొదటిసారి అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ పరిణామం పార్లమెంట్ ప్రాంగణంలో కాసేపు రాజకీయ వేడిని తగ్గించి ప్రశాంత వాతావరణాన్ని నింపింది. ఈ వీడియో సోషల్ మీడియాలో విడుదలైన కొద్దిసేపటికే లక్షలాది వ్యూస్ సాధించింది. రాజకీయ సిద్ధాంతాలు వేరైనా, దేశం కోసం పనిచేసే నేతల మధ్య ఇలాంటి స్నేహపూర్వక వాతావరణం ఉండాలని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అటు బీజేపీ శ్రేణులు, ఇటు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా తమ నేతల మధ్య జరిగిన ఈ భేటీని సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. రాజకీయాల్లో వైరం కేవలం సిద్ధాంత పరంగానే ఉండాలని, వ్యక్తిగతంగా కాదని ఈ ఇద్దరు అగ్రనేతలు నిరూపించారని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంట్ చరిత్రలో ఈ రోజు ఒక ప్రత్యేకమైన మరియు గుర్తుండిపోయే రోజుగా నిలిచిపోనుంది.

## పూలే జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

**- మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం**

**- సమానత్వం, విద్యా విస్తరణకు పూలే సేవలు చిరస్మరణీయం**

**- ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపు**




**హైదరాబాద్, ఏప్రిల్ 11**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటికీ ప్రాసంగికమని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే చేసిన పోరాటం సమాజానికి మార్గదర్శకమని సీఎం అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని గుర్తుచేశారు. మహిళా విద్యాభివృద్ధికి పూలే చేసిన సేవలను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన నమ్మకం నేటికీ ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. యువత పూలే స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుండాలని సూచించారు. పూలే ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఇంధన స్వావలంబన ఏదీ?

రాజకీయ ఘోషలు బిగ్గరగా ఉన్నాయి, అయితే ప్రజల మౌనాలు మరింత బిగ్గరగా ఉన్నాయి! రుతుపవనాల ప్రవేశ భూమి కేరళలో కొద్ది రోజుల క్రితం పర్యటించినప్పుడు అక్కడి ప్రజల్లో ఏదో అశాంతి ఉన్నట్టు గమనించాను. ఆ పశ్చిమ తీర రాష్ట్రంలోని అన్ని పట్టణాలలో ఎల్లెడలా కన్పించే టీ దుకాణాలు మూతపడి ఉన్నాయి. అన్నీ కాకపోయినప్పటికీ, ఉపేక్షించడానికి వీలు లేనంతగా అవి మూతపడ్డాయి. ఒక దుకాణదారు ఇలా అన్నాడు: "ఎల్‌పీజీ సిలిండర్లు లేనప్పుడు మేము ఏమి చేయగలం? పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగానే ఇక్కడ మాకు వంటగ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. ఇందుకు మేము ఎవరినీ నిందించడం లేదు. అయితే ఢిల్లీలోని ప్రభుత్వం మా సమస్యలను ఎందుకు గుర్తించదు?" ఎన్నికల రణగొణ ధ్వనులలో, రాజకీయ ఘీంకారాలలో ఆ సగటు పౌరుని ప్రశ్న సాదాసీదాగా కన్పించవచ్చుగానీ అందులో ఈ 2026 సంవత్సర భారతదేశ ఆర్థిక అంతర్వాహిని ప్రతిధ్వనించడం లేదూ? ఇరాన్ యుద్ధ ప్రభావం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక పరిస్థితులు సజావుగా ఉన్నాయని పాలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయి వాస్తవికత అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఈ సత్యాన్ని అంగీకరించేందుకు పాలకులు నిరాకరిస్తున్నారు. ఇప్పుడు మన ఆర్థిక జీవనాన్ని కల్లోలపరుస్తున్న సంక్షోభం కోవిడ్ లాంటి ఉపద్రవం కాదు మూతపడిన టీ దుకాణం, ఎల్‌పీజీ సిలిండర్ సరఫరాలో తీవ్ర జాప్యం, నిత్యావసర సరుకులను సమకూర్చుకోవడంలో లక్షలాది కుటుంబాల అవస్థలకు మూలాలు దేశ సరిహద్దుల వెలుపల చాలా దూరాన ఉన్నాయి. ఆ అంతర్జాతీయ నేపథ్యం నిర్లక్ష్యం చేయలేనిది. పశ్చిమాసియాలో ఘర్షణలు దిగుమతులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. నిన్నగాక మొన్నటి వరకు ఊహించదగిన రీతిలో ఉన్న ప్రపంచ సరఫరా గొలుసు ఇప్పుడు దాదాపుగా విచ్ఛిన్నమైపోయింది. అమెరికా అధినేత ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. అయితే ప్రపంచవ్యాప్త అంతరాయాలు సంక్షోభాన్ని ప్రేరేపించినా దాని ప్రభావ తీవ్రతను దేశీయ విధానాలే నిర్ణయిస్తున్నాయనే సత్యాన్ని మనం విస్మరించకూడదు. ఇదిగో ఇక్కడే 'అంతా సక్రమంగా ఉన్నది' అన్న ప్రభుత్వ భరోసా ఒట్టి డొల్ల మాట అని స్పష్టమవుతుంది. ఎల్‌పీజీ విషయాన్నే తీసుకోండి. గత పది సంవత్సరాలలో ఈ సంక్షేమ సాధన సదుపాయాన్ని లక్షలాది కుటుంబాలకు సమకూర్చారు. అయితే ఎల్‌పీజీ ధర భరించలేనంతగా పెరిగిపోయినప్పుడు అది అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయోజనమేముంది? ధర పెరిగిపోయి, సకాలంలో సరఫరా కాని ఎల్‌పీజీ సిలిండర్‌ల కారణంగా లక్షలాది కుటుంబాలు ఇప్పుడు తమ వంటగదుల్లో మళ్లీ సంప్రదాయ ఇంధనాలనే వినియోగించుకుంటున్నాయి. ఎల్‌పీజీ కొరత తీవ్రంగా ఉందనడానికి ఇదొక నిదర్శనం. భారత్ ఇప్పటికీ తన క్రూడాయిల్ అవసరాలలో 85 శాతాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్నది. అలాగే 60శాతానికి పైగా ఎల్‌పీజీ అవసరాలను కూడా దిగుమతులే తీరుస్తున్నాయి. యుద్ధం కారణంగా అంతర్జాతీయ విపణిలో వంటగ్యాస్ మరింత ప్రియమవడం, సరఫరాలకు తీవ్ర అంతరాయాలు ఏర్పడడంతో భారతీయ వంటగదులకు కూడా ఆ యుద్ధం పాకినట్లయింది. సందేహం లేదు. వంటగ్యాస్ విషయంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం దిగుమతి సుంకాలను తగ్గించింది. పలు ఉపశమన చర్యలు చేపట్టింది. అయితే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తరువాత ధరలు మళ్లీ పెరుగుతాయన్న ఆందోళన ప్రజల్లో తీవ్రంగానే ఉన్నది. ఒక ఇబ్బందికరమైన ప్రశ్న వేయక తప్పదు: అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ తగ్గుదల ప్రయోజనాలను వినియోగదారులకు ఎందుకు సమకూర్చలేదు? యుద్ధాల సమయంలో ప్రపంచ మార్కెట్లలో ధరలు పెరుగుతాయి. ప్రభుత్వాల నుంచి వినియోగదారులకు సమకూరే సహాయమూ తగ్గిపోతుంది. దీని పర్యవసానాలు ఇప్పుడు అంతటా కనిపిస్తున్నాయి. కేరళలో టీ దుకాణాన్ని మూసివేసిన చిరువ్యాపారి ఒకరు ఉత్పాదకాల ధరల పెరుగుదల వల్లే తనకు ఆ దుస్థితి దాపురించిందని వాపోయాడు.

# నన్ను నేను తెలుసుకున్నా

‘గ్యాంగ్‌లీడర్’తో తెలుగు తెరకు పరిచయమైన చెన్నై బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్. ఆ చిత్రంలో పరిమిత భావాలతోనే అందరి హృదయాలనూ కొల్లగొట్టింది. తర్వాత ‘శ్రీకారం’ సినిమాలో బబ్లీ గాళ్‌గా తన నటనలో మరో కోణాన్ని ఆవిష్కరించింది. ‘ఓజీ’లో పవన్‌తో జట్టుకట్టి స్టార్ హీరోయిన్ అనిపించుకుంది. తెలుగుతోపాటు తమిళంలో స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుంది. తాజాగా ‘మేడ్ ఇన్ కొరియా’ సినిమాతో ప్రేక్షకులను మెప్పించింది. బాక్సాఫీస్ రిజల్ట్ ఎలా ఉన్నా.. ఓటీటీలో ఈ సినిమా రికార్డ్ స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. ఈ సినిమాతో తనను తాను తెలుసుకున్నానంటున్న ప్రియాంక చెప్పిన కబుర్లు ఇవి..చి న్నప్పటి నుంచి నాకు నటనంటే చాలా ఇష్టం. సినిమాలు చూస్తున్నప్పుడు.. నన్ను నేను తెరపై ఎప్పుడు చూసుకుంటానా అనిపించేది. నాతోపాటు ఆ ఇష్టం కూడా పెరిగింది.

బయో టెక్నాలజీలో డిగ్రీ చేశానన్న మాటే కానీ, నా మనసంతా సినిమాలపైనే ఉండేది. అందుకే, డిగ్రీ పూర్తవ్వగానే.. అలా అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను.క న్నడ చిత్రసీమ నుంచి వెండితెరకు పరిచయమయ్యా. 2019లో విడుదలైన ‘ఒంధ్ కథే హెళ్లా’ నా మొదటి సినిమా. ఆ చిత్రం విడుదలైన రోజు నా కల నిజమైంది. మొదటిసారి కెమెరా ముందు నిల్చున్నప్పుడు చాలా ఇబ్బందిగా ఫీలయ్యా. చిత్ర యూనిట్ మద్దతుతో ఒత్తిడిని అధిగమించా. ఆ సినిమా షూటింగ్ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను.నేను కలిసి పనిచేసిన హీరోలు, నటీనటులు, దర్శకులు, నిర్మాతల నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. వాళ్ల అనుభవం, అంకితభావం, సినిమాపై వాళ్లకున్న ప్యాషన్ నన్నెంతో ప్రభావితం చేశాయి. నాని, శర్వానంద్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. ‘ఓజీ’లో పవన్‌కళ్యాణ్ సరసన చేయడం మరచిపోలేని అనుభూతి.‘గ్యాంగ్‌లీడర్’ తర్వాత ఎన్నో అవకాశాలు వచ్చాయి. అయితే, పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తాను. సవాలు విసిరే రోల్స్ నాకు ఇష్టం. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించినప్పుడే.. నటిగా గుర్తింపు సాధ్యమవుతుంది. ‘మేడ్ ఇన్ కొరియా’తో అలాంటి అవకాశం లభించింది. ఈ సినిమాతో నన్ను నేను తెలుసుకున్నాను అనిపించింది.షూటింగ్స్ లేనప్పుడు కుటుంబంతో గడపడానికే ప్రాధాన్యం ఇస్తా! స్నేహితులతో కాలక్షేపం చేయడం ఇష్టం. పుస్తకాలు బాగా చదువుతాను. బుక్ రీడింగ్ వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. అలాగే ట్రావెలింగ్ అన్నా ఇష్టమే! కొత్తకొత్త ప్రదేశాలు చూస్తున్నప్పుడు మనసుకు ఎంతో రిలీఫ్‌గా అనిపిస్తుంది. ఒత్తిడికి గురైనప్పుడు వంట చేసి రిలాక్స్ అవుతుంటాను.



# ఉత్కంఠ కలిగించే పరమపద సోపానం



అర్జున్ అంబటి హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ ‘పరమపద సోపానం’. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. నాగ శివ దర్శకుడు. గణపర్తి నారాయణరావు, తేలప్రోలు ప్రసన్న ఆంజనేయులు నిర్మాతలు. ఈ నెల 24న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా దర్శకుడు నాగశివ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, అర్జున్ అంబటి నటన, దేవ్ జాండ్ సంగీతం ఈ సినిమాకు హైలైట్స్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఈశ్వర్, సహ నిర్మాత: పులగం సుప్రియ, నిర్మాణం: స్వయంభూ క్రియేషన్స్.

# లబ్బు డబ్బు! తాయ్ కిళవి



డబ్బుకు లోకం దాసోహం. మనిషి బతకాలన్నా.. ఆ మనిషిని బతికించాలన్నా డబ్బే అవసరం. ఇలా పైకం చుట్టూ తిరిగే కథలెన్నో వెండితెరపై సందడి చేశాయి. బాక్సాఫీస్ దగ్గర డబ్బును బాగానే వసూలు చేశాయి. ఇదే విషయాన్ని కాస్త వినోదాత్మకంగా వివరించే ప్రయత్నమే.. తాయ్ కిళవి చిత్రం. రూ.10 కోట్లతో తెరకెక్కిన ఈ తమిళ చిత్రం.. రూ.75 కోట్లకు పైగా కొల్లగొట్టింది. ఈ యేడాది తమిళ బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తాజాగా, జియో హాట్‌స్టార్ వేదికగా తెలుగులోనూ స్ట్రీమింగ్‌కు వచ్చింది. బంధాలన్నీ డబ్బు చుట్టే తిరుగుతూ.. నానాటికీ తీసికట్టుగా మారుతున్న మానవ సంబంధాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ చిత్ర కథలోకి వెళ్తే.. ఒక మారుమూల గ్రామంలో ఉండే పవునుతాయి (రాధికా శరత్ కుమార్) అనే వృద్ధురాలి చుట్టూ తిరిగే కథ ఇది. పవునుతాయి అంటే.. ఊరివాళ్లంతా హడలిపోతుంటారు. అందుకు కారణం.. వాళ్లంతా ఆమె దగ్గర అప్పు తీసుకున్నవారే. అందుకే, వడ్డీ కోసం ఆమె వస్తున్నదంటే.. ఎక్కడి వాళ్లు అక్కడ తప్పించుకుని తిరుగుతుంటారు. అయినా, వదలదామె. దొరికినవారి దగ్గర ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తుంది. అందుకే ఆమె ఎప్పుడు చచ్చిపోతుందా? అని అందరూ దేవుడికి మొక్కుకుంటూ ఉంటారు. ఇక పవునుతాయి వ్యక్తిగత జీవితం వేరేలా ఉంటుంది. ఆమె కూతురు సురుళి (రైచల్), మనవడు రాజు.. తల్లి దగ్గరే ఉంటారు. మూడు తులాల బంగారం విషయంలో అల్లుడితో మనస్పర్థలు రావడం వల్లే.. సురిళిని పుట్టింటికి పంపిస్తాడు. ఇక పవునుతాయి ముగ్గురు కొడుకులు కూడా ఆస్తి విషయంలో తల్లితో గొడవపడతారు. భార్యలతో కలిసి ఇల్లొదిలి వెళ్లిపోతారు. కాలం అలా గడుస్తుండగా.. ఒక రోజున పవునుతాయికి పక్షవాతం వస్తుంది. కాళ్లు-చేతులతోపాటు మాట కూడా పడిపోతుంది. కేవలం చేతులతోనే సైగలు చేస్తుంటుంది. ఎక్కువ సేపు స్పృహలో కూడా ఉండలేదు. దాంతో ఇక తమకు ఆమె వేధింపులు ఉండవని ఊళ్లో వాళ్లు సంబురపడతారు.ఆస్తుల కోసం కొడుకులు-కోడళ్లు, బంగారం కోసం అల్లుడు ఆమెముందు వాలిపోతారు. ఆమె ఎప్పుడు చనిపోతుందా?! అని ఎదురుచూస్తుంటారు. ఇంతలోనే ఓ బంగారం షాపు నుంచి ఒక వ్యక్తి వారి ఇంటికి వస్తాడు. కొన్ని రోజుల క్రితం పవునుతాయి తన దగ్గర నుంచి భారీగా బంగారం తెచ్చిందని కుటుంబ సభ్యులతో చెబుతాడు. బంగారం మాట వినగానే.. కుటుంబ సభ్యులు ఎలా రియాక్ట్ అవుతారు? దాన్ని ఎక్కడ దాచిందో తెలుసుకోవడానికి ఏం చేస్తారు? పవునుతాయి దాచిన బంగారాన్ని ఎలా కనిపెట్టారు? ఈ క్రమంలో వాళ్లకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అన్నది కథ.

# స్వయంభూ స్వరాలాపన



నిఖిల్ సిద్ధార్థ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పానిండియా హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ ‘స్వయంభూ’. సంయుక్త మేనన్, నభా నటేష్ కథానాయికలు. భరత్‌కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. ఠాగూర్ మధు సమర్పకుడు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ సినిమాలోని తొలి పాటను ఈ నెల 16న విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ శనివారం ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ని విడుదల చేశారు. దట్టమైన అడవిలో నిలబడి, ఈటను విసరడానికి సిద్ధంగా ఉన్న యోధుడిగా నిఖిల్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఈ పాట ఎంత గ్రాండియర్‌గా ఉండబోతున్నదో ఈ పోస్టర్ చెబుతున్నది. ‘రా రా ధీవర..’ అంటూ సాగే ఈ పాటను రవి బస్రూర్ స్వరపరిచారు. ఈపాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి మాటలు: విజయ్ కామిశెట్టి, కెమెరా: కె.కె. సెంథిల్‌కుమార్, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్.

# డ్రాగన్‌ని ఢీ కొట్టేది తనేనా?!



అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్‌తో దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం ‘డ్రాగన్’ (వర్కింగ్ టైటిల్)పై ఆడియన్స్‌లో అంచనాలు మామూలుగా లేవు. ఆలస్యం అవుతున్నకొద్దీ అవి అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇందులో విలన్ పాత్ర చాలా కీలకం. దీనికోసం ముందు మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌ని అడిగారు. కానీ టోవినో ఖాతాలో పూర్తి చేయాల్సిన సినిమాలు చాలానే ఉండటంతో ‘డ్రాగన్’కు ఆయన ఓకే చెప్పలేకపోయారు. అయితే.. ఇప్పుడు ఈ ప్లేస్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ వచ్చి చేరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో విలన్‌గా షాహిద్ దాదాపుగా ఖరారైనట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయి. ఇదే కనుక నిజమైతే బాలీవుడ్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి బూస్టప్ రావడం ఖాయం. మరి ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. రుక్మిణీవసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి.

# ప్యారడైజ్ ప్రపంచంలో సుబ్బలక్ష్మి



అగ్ర కథానాయకుడు నాని నటిస్తున్న పానిండియా పీరియడ్ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’. ప్రముఖనటుడు మోహన్‌బాబు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. కయాదు లోహర్ కథానాయిక. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సుధాకర్ చెరుకూరి నిర్మాత. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో సినిమా విడుదల కానున్నది. శనివారం చిత్ర కథానాయిక కయాదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఆమె ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ‘ది ప్యారడైజ్’ ప్రపంచంలో సుబ్బలక్ష్మి అలియాస్ సుబ్బుగా సైకిల్‌పై వస్తూవున్న కయాదు లోహర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ సినిమా మొత్తం రగ్డ్, ఇంటెన్స్ ప్రపంచంలో కనిపిస్తున్నప్పటికీ, కయాదు పాత్ర మాత్రం అందుకు పూర్తి భిన్నంగా అద్భుతమైన సౌందర్యంతో సాక్షాత్కరించింది. ఇప్పటికే భారీ విజువల్స్, గ్రాండ్ సెట్టింగ్స్‌తోపాటు బలమైన పాత్రలతో అంచనాలను పెంచుతున్న ఈ చిత్రంలో రాఘవ్ జుయాల్, సంపూర్ణేష్ బాబు ముఖ్య పాత్రల్లో కనిపంచనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ సాయి, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణం: ఎస్‌ఎల్వీ సినిమాస్.